


—మైనంపాటి భాస్కర్

బస్ స్టాప్ దగ్గర అసహనంగా వేచి ఉన్నాడు సుధాకర్. వాచీ చూసుకున్నాడు. తొమ్మిదింబావు అయింది. సుశీల ఇంకా రాలేదు. తొమ్మిదింటికల్లా వచ్చేస్తానని అన్నది. తామిద్దరూ కలిపి స్పెండ్ చేయదలుచుకున్న గంటలో అప్పుడే పదిహేను నిమిషాలు గడిచి పోయాయి.


పక్కనే ఉన్న పాన్ షాపుకి వెళ్లి వక్కపొడి కొన్నాడు. దొంతర్లుగా పెట్టి ఉన్న పేపర్ల హెడ్‌లైన్లన్నీ ఓపిగ్గా చదివాడు.

"హిప్పో పొటామస్" లాంటి డబుల్ డెక్కర్ వచ్చి పెద్దగా మూలుగుతూ ఆగింది. గుంపులు గుంపులుగా అమ్మాయిలు దిగారు.

సుశీల లేదు.

ఇంకో ఎర్రచీరె అమ్మాయి దిగుతోంది. సుశీల కాదు.

# పేపర్ వెయిట్



బస్సు మళ్ళీ భారంగా మూలిగి శ్రమపడుతూ కదిలి వెళ్ళిపోయింది.

మళ్ళీ టైం చూసుకున్నాడు. తొమ్మిదీ నలభై ఐదు.

అకస్మాత్తుగా ఓపిక చచ్చిపోయింది సుధాకర్‌కి. కోపం వచ్చేసింది.

ఏమిటీ అమ్మాయి పద్ధతి? తనంటే నిర్లక్ష్యమా? టైమయిపోయింది. ఇంక ఆఫీసు కెళ్ళాలి.

సుశీం ఇంకా రాలేదు. చీరె సింగారించడం కాలేదేమో! హుఁ! ఏం ఆడవాళ్ళు!

మళ్ళీ ఇంకో బస్సు ఆగింది. వెళ్ళింది.

పెదిమలు బిగించాడు సుధాకర్.

తనవైపే ఎవరో నడిచి వస్తున్నారు. అందంగా-పొడుగ్గా. నవ్వు మొహంతో.

సుధాకర్ కూడా నవ్వబోయి

మానేశాడు.

"లేటయింది కదూ?" అంది సుశీల నెమ్మదిగా.

"అబ్బే! పది గంటలేగా అవుతోంది" అన్నాడు.

"అప్పటికీ ఆటోలోనే వచ్చాను. అది కాస్తా లైట్‌హౌస్ టాకీస్ దగ్గర చెడిపోయింది. ఇంక దగ్గరేకదా అని నడిచి వచ్చేశాను" అని టైమ్‌చూసుకుని, 'తొందరగా కాఫీ తాగేసి వెళ్లిపోదామా?" అంది.

"వెధవ కాఫీ కోసమేనా ఎనిమిదిన్నర నుంచీ నేను పడిగాపులు గాస్తోంది?"

"కోపం వచ్చిందా? మరేం చేద్దాం?" అనునయంగా అడిగింది.

సుశీల బతిమాలుకునే ధోరణిలో ఉన్నందుకు సుధాకర్ సంతోషించాడు. మొహం చిట్లించి, సుశీల వైపు చూ డ కుం డా నే, "లీవు పెట్టెయ్ ఇవ్వాళ" అన్నాడు.

"లీవు పెట్టి?"

"లీవు పెట్టేసి క్వాలిటీలో కాఫీ తాగి, ఏదన్నా మార్నింగ్‌షోకి వెళదాం. మధ్యాహ్నం కాఫీతాగి నౌబత్ పహాడ్ ఎక్కుదాం. సాయంత్రం మళ్ళీ కాఫీ తాగుదాం. సరేనా?" అన్నాడు. ఉవ్వెత్తున వచ్చిన సంతోషాన్ని ఆపుకుంటూ.

"మరి లీవ్ అప్లై చెయ్యొద్దూ?"

"ఫోన్‌చేసి చెప్పెయ్."

"మీ ఇష్టం" అంది సుశీల.

ఒక ఫాన్సీషాప్‌లోంచి ప్రిన్సిపాల్‌కి ఫోన్‌చేసి వంట్లో బాగా లేదనీ, తను ఆ రోజు క్లాసులు తీసుకోలేననీ చెప్పింది సుశీల. సుధాకర్ కొంచెం పక్కకు తిరిగి జేబులో ఐదు పది రూపాయల నోట్లు భద్రంగా ఉన్నాయో లేవో చూసుకున్నాడు. తర్వాత తను కూడా ఆఫీసుకి ఫోన్‌చేసి లీవు పెట్టేశాడు.

షాపువాడు ఇద్దర్నీ కొంచెం వింతగా చూశాడు.

'పద' అని క్వాలిటీ వైపు దారి తీశాడు సుధాకర్.

లోపలికి ప్రవేశిస్తూ మళ్ళీ జేబులో నోట్లొకసారి తడిమి చూసుకున్నాడు.

హోటల్ డోర్‌మాన్ తలుపు తెరిచి పట్టుకున్నాడు.

లోపల ప్రవేశించగానే చల్లగా అనిపించింది. కన్‌సీల్డ్ లైటింగ్ కళ్ళకు శ్రమలేకుండా మెత్తగా ఉంది. మృదువుగా ఉన్న సోఫాలూ. తెల్లటి గుడ్డలు పరిచిన టేబుల్సూ. గ్లాస్ విండోస్‌లోంచి ఆబిడ్స్ కనబడుతోంది. అటువైపున ఒక సోఫాలో ప క్క ప క్క న కూర్చున్నారు.

"ఏం తీసుకుంటావ్" అన్నాడు సుధాకర్.

"ఇప్పుడేకదా భోజనం చేసింది కాఫీ తాగుదాం" అంది.

"పోనీ మంచి ఐస్ క్రీం తిను" అని చటుక్కున గుర్తొచ్చినట్లు. "అరె, సారీ సుశీలా, హాపీ బర్త్‌డే ఇందాకట్నుంచీ చెప్పడం మర్చే పోయాను సుమా!"

"అబ్బ! ఇప్పటికన్నా గుర్తొచ్చింది మీకు."

"నువ్వు లేట్ చేసేసరికి అంతా మర్చిపోయాను. సమ్‌టైమ్స్ యూ మేక్ మీ మాడ్."

అందంగా మూతి బిగించింది సుశీల.

"అయితే తప్పకుండా ఐస్ క్రీం తినాల్సిందే" అని "టూ హనీ మూన్ స్పెషల్" అని ఆర్డరిచ్చాడు.

సుశీల నవ్వింది.

"మంచి పేరే!"

అందంగా బోటులా ఉన్న కప్పులో అమర్చిన ఐస్‌క్రీంని అందమైన సుశీల వేళ్ళు, అంతకంటే అందంగా ఉన్న ఆమె పెదిమల మధ్యకు పెద్ద స్పూన్‌తో చేర్చడం ఆరాధనగా చూస్తున్నాడు సుధాకర్.

మెల్లిగా అతని వైపుకి తిరిగింది.

"ఏమిటలా చూస్తున్నారు?" అంది సిగ్గుపడుతూ.

"నువ్వు ఆ రోజున.........మీ కారులో లిఫ్ట్ ఇవ్వడం గుర్తొస్తోంది. అప్పుడే రెండేళ్ళవుతోంది కదూ!"

సుశీల పెదిమలు చిరునవ్వుతో విడిపడ్డాయి. కళ్ళల్లో జ్ఞాపకాలు మెదిలాయి.

అవును. భయం భయంగా కార్లో ఒదిగి కూర్చున్న ఆ అబ్బాయేనా తనని అనుకుని కూర్చున్నాడు ఇప్పుడు! ఇది సంభవమని అనుకుందా? అమ్మో!

ఆ రోజు.

ఆర్. టీ. సీ. స్ట్రయిక్. తను రోజూ కాలేజీకి బస్సులో వెళుతుంది. నాన్నగారు కార్లో వెళతారు.

ఆవేళ తనని పిలిచారు. "చూడమ్మా! బస్సులు, ఆటోలూ దొరకడం కష్టమే ఇవ్వాళ. పైగా వర్షం కురుస్తోంది. నువ్వు కార్లో వెళ్ళిపో. నేను ఫోన్ చేసి కంపెనీ కారుతెప్పించుకుంటాను" అన్నారు

"అలాగే నాన్నగారూ!" అంది ఉత్సాహంగా. తను మూడేళ్ళ క్రితమే డ్రైవింగ్ లైసెన్సు తీసుకున్నా, నాన్నగారు తనకి కారు అప్ప చెప్పడం చాలా అరుదు.

రాజారావుగారు అదేదో ఫారిన్ కంపెనీలో పనిచేస్తూ నెలకి మూడు వేలు సంపాదిస్తున్నా. స్వతహాగా

కొద్ది ఆస్థిపరులే అయినా, అందరు ధనవంతుల్లా పిల్లల్ని అతి గారా బరంచేసి చెడగొట్టే రకం కాదు. ఆయనకి సుశీలంటే ప్రాణం. ఆయన భార్య సుశీల ఏడో ఏటే పోయింది. అయినా మళ్ళీ పెళ్లి చేసుకోడానికి ఆయన ఆసక్తి చూప లేదు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సుశీ లకి చదువు చెప్పించారు.

ఎమ్మెస్సీ పాసవగానే కాలే జీలో లెక్చరర్‌గా జాబ్ వచ్చింది. రాజారావుగారుకూడా చేరమన్నారు.

కొంతమంది అబ్బాయిలూ, అమ్మాయిలూ కార్లకి సైలెన్సర్లు తీసేసి పెద్ద రొదతో, అపరిమిత మైన వేగంతో డ్రైవ్ చేస్తారు. సుశీలకలా ఇష్టంకాదు. కారంటే హంసలా, నిశ్శబ్దంగా జారి పోవా లని అనుకుంటుంది. గారేజీలోంచి ఫియట్‌కారు బయటికి తీసింది.

రోడ్లమీద బస్సులు కనబడ్డం లేదు. ఖాళీ ఆటోలూ, రిక్షాలూ కూడా లేవు. కారులో రావడం మంచిదే అయింది.

తను రోజూ బస్సెక్కే స్టాప్ వచ్చింది. జనం గుంపులు గుంపు లుగా, చిరాగ్గా నిలబడి ఉన్నారు.

"సుశీలకి నేరం చేసినట్లని పించింది. ఐదు మంది పట్టే కార్లో తనొక్కతే వెళ్తోంది. అక్కడ నిలబడి ఉన్న అమ్మాయి లిద్దర్నీ ఎక్కించుకుంటే ఏం?

పేవ్‌మెంట్ పక్కన ఆపింది కారు, బస్‌స్టాప్ దాటి అప్పుడే యాభై గజాలు వచ్చేసింది.

కిటికీలోంచీ తల బయటకు పెట్టి ఆ అమ్మాయిల వైపు చూసి తల ఊపింది నవ్వుతూ.

ఆ అమ్మాయిల మొహం ప్రసన్నమయింది.

పరుగులాంటి నడకతో వచ్చి 'చాలా థాంక్సండీ' అంటూ వెనక సీట్లో ఎక్కి కూర్చున్నారు.

అప్పుడు చూసిందతన్ని,

సంశయంగా తనవైపే చూస్తు న్నాడు. అతని మొహంలో ఆరా టం - ఏదో అడగబోయి మళ్ళీ మానేశాడు.

కారు గేరు మార్చింది సుశీల. కారు కదలగానే నిలిచి ఉన్న వాన నీళ్ళు చింది అతనిమీద పడ్డాయి.

"అరెరె....ఐయామ్ సారీ" అంది కంగారుగా,

అతను ఆదుర్దాగా పాంట్ వైపు చూసుకున్నాడు. కొద్దిగా తడిసింది. బురద అంటలేదు,

అతనేమనుకుంటాడో అని భయపడింది. అంతలోనే కొద్దిగా జాలికూడా వేసింది, మనిషి మర్యా దస్తుడిలాగే కనబడుతున్నాడు. పైగా

కార్లో ఇంకో ఇద్దరమ్మాయిలు ఉన్నారు కాబట్టి ఫర్వాలేదనుకుంది.

"ఎక్కండి. డ్రాప్ చేస్తాను."

అతను పరుగున వచ్చి ఫ్రంట్ డోర్ తీసి ఒదిగి కూర్చుని మళ్లీ డోర్ వేశాడు.

కారు కదిలింది.

"ఎక్కడిదాకా వెళ్ళాలి మీరు" అంది కొద్దిగా తలతిప్పి ఆ అమ్మాయిని చూస్తూ.

"బషీర్ బాగ్" అన్నది ఒకమ్మాయి.

"రాణీగంజ్" అంది ఇంకో అమ్మాయి.

"మీరు?" అంది అతనితో.

"నేను కోఠీ వెళ్ళాలండీ. ఇవ్వాళ ఒక జాబ్‌కి ఇంటర్వ్యూ వచ్చింది. బస్సులూ, ఆటోలూ దొరకలేదు. కొంచెం త్వరగా బయలుదేరి ఉండాల్సింది నేను. మీరు లిఫ్టు ఇవ్వకపోతే చాలా ఇబ్బంది అయ్యేది" అన్నాడు కృతజ్ఞతగా.

"డోంట్ మెన్షన్. నేను అటే వెళ్లేది. మిమ్మల్ని కోఠీలో డ్రాప్ చేస్తాను." అంది మామూలుగా.

"చాలా థాంక్సండీ."

రాణీగంజ్‌లో ఒకమ్మాయి దిగిపోయింది.

కారు కదలగానే తలుపు కొద్దిగా శబ్దం చెయ్యసాగింది. కారాపింది సుశీల.

"డోర్ సరిగా పడలేదు. తెరిచి మళ్ళీ గట్టిగా వెయ్యండి" అంది. అతను హడావిడిగా, ఏదో ఆజ్ఞను శిరసావహిస్తున్నట్లు తలుపు తెరిచి మళ్లీ వేశాడు.

సరిగా పడలేదు.

ఒక్క క్షణం తటపటాయించి తనే అతని మీదుగా ఒంగి డోర్ వేసింది.

అప్పుడతని అవస్థ వర్ణనాతీతం. మొహమాటం, కృతజ్ఞత కలిపి అతని మొహం ఎఱ్ఱబడేట్లు చేశాయి.

'నాకంటే కూడా సిగ్గెక్కువ ఇతనికి' అనుకుంది సుశీల. చూసీ చూడనట్లు అతన్ని చూసింది ఏదో చెప్పలేని మంచితనం అతనిలో కన్పించింది సుశీలకు.

కోఠీ దగ్గర పడింది.

"చాలా థాంక్సండీ. ఇక్కడెక్కడన్నా ఆపేస్తే దిగి వెళ్ళిపోతాను" - కొద్దిగా ఖాళీగా ఉన్న చోట కారాపింది.

కారు దిగి, "థాంక్స్ మిస్" అన్నాడు.

చిరునవ్వు నవ్వింది సుశీల. 'బెస్ట్ ఆఫ్ లక్' అంటూ కారు స్టార్ట్ చేసింది.

ఆ తర్వాత అతన్ని గురించి ఆలోచించలేదు.

మళ్ళీ దాదాపు సంవత్సరం తర్వాత....

అదేదో తెలుగు సినిమా చాలా చాలా బాగుంది అని విని సుప్రియతో కలిసి వెళ్ళింది. అప్పటికే పెద్దక్లాసు టిక్కెట్లనీ రిజర్వై పోయాయి. వెళ్ళగల ఇంకొక్క క్లాసుకీ హనుమంతుడి తోకలాంటి క్యూ.

"ఏం చేద్దామే?" అంది సుప్రియ.

"ఇంటికెళ్ళిపోదాం."

"ఛ! ఇంత దూరమొచ్చి ఊరికే వెళ్లిపోతే ఏంబాగుంటుంది? శ్రీనివాసాలో 'క్రేజీ బాయ్స్' ఉంది. మూడున్నరకి కాఫీ తాగి, మెల్లిగా నడిచివెళ్దాం. ఆ టైముకి చేరుకోవచ్చు' అంది

సుశీల ఒప్పుకుంది. తీరిగ్గా కాఫీ తాగి, అంతకంటే తీరిగ్గా షాపుల్లో వేలాడదీసిన చీరెలు పరికిస్తూ నడిచి వెళ్ళారు. ఆ థియేటర్లో కూడా విపరీతమైన జనం. పెద్దలెంతమందో, అంతకు నాలు గింతలు పిల్లలు. కార్లు, స్కూటర్లు ట్రాఫిక్ జాంలాగా ఉంది. 3-50 క్లాసులో నిలబడ్డారు అరగంట సేపు.

టిక్కెట్లు ఒక ఇరవై మందికి ఇచ్చి బుక్కింగ్ క్లోజ్ చేసేశాడు. మిగతా టికెట్లన్నీ అంతకుముందే రిజర్వ్డట.

సుశీల ప్రాణం ఉసూరుమంది. శుభ్రంగా ఇంట్లో ఉండి నిద్రపోయినా బావుండేది అనుకుంది.

అప్పుడు మళ్లీ కనబడ్డాడతను.

ఒకసారి చూసి తల తిప్పుకుని, మళ్ళీ అంతలోనే గుర్తొచ్చినట్లు పరీక్షగా చూశాడు.

బావుండదని కొద్దిగా స్మైల్ చేసింది సుశీల.

అతను 'నమస్కారమండీ' అన్నాడు. వెంటనే "ఆ రోజు మీరిచ్చిన లిఫ్టు నాకు చాలా లక్కీగా ప్రూవయింది. ఉద్యోగం వచ్చేసింది." అన్నాడు సంతోషంగా.

'ఐయామ్ వెరీగ్లాడ్! కంగ్రాట్స్' అంది సుశీల సిగ్గుతో బుగ్గలు కొద్దిగా ఎఱ్ఱబడుతుండగా. అతను ఇదివరకటికంటె కొద్దిగా వళ్లు చేశాడు. చాక్లెట్ కలర్ పాంటూ, తెల్లషర్టూ - 'చక్కగా ఉంటాడు' అనుకుంది మనసులో.

"సినిమాకొచ్చారా?" అన్నాడు.

"అవును. టిక్కెట్లు దొరకలేదు" అంది సుశీల.

"మరి చెప్పరేం. నేను తెస్తానుండండి" అని త్వరత్వరగా వెళ్లాడు.

"ఎవరే?" అంది సుప్రియ ఆసక్తిగా. "పేరు తెలియదే. ఒకసారి కారులో లిఫ్టు ఇచ్చాను. అంతే"

అంది సుశీల. సుప్రియ నమ్మనట్టు చూపింది.

అతను మూడు టిక్కెట్లు పట్టు కొచ్చాడు.

"ఎలా దొరికాయ్ టిక్కెట్లు?" అంది.

"బయట ఎవడో బ్లాక్ చేస్తు న్నాడు. కొనేశాను- సారీ."

"ఎంతయింది?" అంది హాండ్ బాగ్‌లోంచి డబ్బులు తీస్తూ.

"మూడున్నరది నాలుగు రూపాయల కిచ్చాడు" అన్నాడు. నిజానికి ఐదున్నరకి కొన్నాడు తను.

సుశీల నవ్వింది.

"నిజం చెప్పండి. మీకు అబ ద్ధాలాట్టం చేతకాదు."

"నిజమే" అన్నాడు తడ బడుతూ.

"ఐదున్నరకి కొన్నారు. అవునా!" అంది సూటిగా.

"అవును. మీకెలా తెలుసు?" అన్నాడాశ్చర్యంగా.

"ఈ పక్కవాళ్ళెవరో కూడా కొన్నట్లున్నారు, విన్నాను" అని పదకొండు రూపాయలు అతని చేతిలో పెట్టింది.

"వద్దండీ! ప్లీజ్!" అన్నాడు సుధాకర్. సుశీల వినిపించుకో లేదు. థియేటర్లో సుధాకర్, సుశీల ఆ పక్కన సుప్రియ కూర్చు న్నారు. "నా పేరు సుశీల. ఇక్కడే కాలేజీలో బాటనీ లెక్చరర్‌గా ఉంటున్నాను. ఈమె నా కొలీగ్ సుప్రియ" అంది పరిచయం చేసు కుంటూ.

సుప్రియ నమస్కారం చేసింది.

సుధాకర్ ప్రతి నమస్కారం చేశాడు. "నేను సుధాకర్. ఏదో చిన్న ఉద్యోగిని."

"మీ శ్రీమతిని తీసుకురాలేదేం సినిమాకు?" అంది సుశీల. సుధా కర్ నవ్వాడు.

"ఇంకా శ్రీమతి లేదండీ."

పిక్చరు మంచి కామెడీ.

సీట్లలో సుధాకర్ ఇటువైపూ, సుశీల అటువైపూ దూరదూరంగా ఒదిగి కూర్చున్నా సినిమాలో నవ్వు వల్ల అలా చాలా సేపు కూర్చోవడం కష్టమయింది. తర్వాత మామూలుగానే కూర్చు న్నారు. ఇంటర్వెల్‌లో సుధాకర్ ముగ్గురికీ కూల్‌డ్రింక్స్ తెప్పిం చాడు. సినిమా అయిన తర్వాత మళ్ళీ అతనే అడిగాడు, దాదాపు ప్రాధేయపడుతూ. "మిస్ సుశీలా! మీవల్లే నాకు ఉద్యోగం వచ్చిందని ఎందుకో నమ్మకం ఏర్పడి పోయింది. ఒక చిన్న పార్టీ

ఇస్తాను. కాదనకండి ప్లీజ్!"

సుశీల సుప్రియవైపు చూసింది. సుప్రియ అంగీకరిస్తూ తలూపింది. పక్కనే ఉన్న హోటల్ కెళ్లారు.

ఆ తర్వాత పరిచయం ప్రణయంగా మారడానికి వారంరోజులు పట్టలేదు.

చిక్కటి నురుగులు కక్కుతున్న ఎస్ప్రెస్సో కాఫీ చప్పరించింది సుశీల. కొద్దిగా నురుగు పెదాల కంటింది. కర్చీఫ్ తో తుడుచుకుంటూ "ఇవ్వాళ మీరు ఇంటికొచ్చి నాన్నగారితో చెప్పెయ్యండి" అంది.

"వద్దు సుశీలా! నేను సరిగ్గా మాట్లాడలేను. నువ్వే ఎలాగోలా చెప్పెయ్" అన్నాడు ఆదుర్దాగా.

సుశీల మాట్లాడకుండా ఆలోచిస్తూ కూర్చుంది.

సుధాకర్ చెప్పింది నిజమే. తనతోనే సరిగ్గా మాట్లాడడు. నాన్నగారితో తను చెప్పడమే ఉత్తమం.

సాయంత్రం దాకా హైద్రాబాదంతా తమదే అయినట్లు తిరిగారు. ఆబిడ్స్ దగ్గర సుశీలను బస్సెక్కిస్తూ "మర్చిపోకేం. మీ నాన్నగారితో చెప్పెయ్. రేప్పొద్దున్నే బస్టాప్ దగ్గరి కొస్తాను. సరేనా?" అన్నాడు.

తల ఊపి బస్సెక్కింది సుశీల.

రాత్రి నాన్నగారు ఇంటికి వచ్చేదాకా గుండెల్లో గుబగుబలాడుతూనే ఉంది.

నాన్నగారు అంత పట్టుదల మనిషి కాదు. తను నచ్చచెప్తే కాదనరేమో!

అంతగా కోపమొస్తే రెండ్రోజులు సరిగా పలకరించరు.

అయినా ఈ సంబంధానికి పెద్ద అభ్యంతరం ఉండకపోవచ్చు. సుధాకర్ వాళ్ళది మామూలు కుటుంబం. ఆస్తిపరులు కారు. కొద్దిగా చిక్కేమిటంటే, అతని ఉద్యోగం తన ఉద్యోగంకన్నా చిన్నది. నాన్నగారు పెద్ద పెద్ద ఆశలు పెట్టుకున్నారేమో?

డైనింగ్ టేబుల్ దగ్గర తండ్రితోపాటు భోజనానికి కూర్చుని కంచంలో అన్నం కెలుకుతూ కూర్చుంది. రెండు మూడుసార్లు ఏదో చెప్పబోయి మానేసింది.

ఆయనే తలెత్తారు. "ఏమిటమ్మా? ఏమన్నా మాట్లాడాలా?"

తల వంచుకుంది సుశీల.

"చెప్పమ్మా ఏమిటి" బుజ్జగిస్తున్నట్లు అడిగారు.

చివరికి మాటలు పేర్చుకుని చెప్పింది.

"సుధాకర్ అని ఒకాయన

ఉన్నారు నాన్నగారూ, నన్ను మ్యారేజ్ చేసుకుంటానని ప్రపోజ్ చేశారు."

ఒక్క క్షణం మాట్లాడలేదు రాజారావుగారు.

"ఎవరబ్బాయమ్మా."

చెప్పింది సుశీల. ధైర్యం వచ్చేసింది. నాన్నగారు కోపగించుకోలేదు.

"అన్నీ కలిశాయి నాన్నగారూ, చివరికి నక్షత్రం కూడా."

నవ్వాపుకున్నారు ఆయన.

"ఎవరికి చూపించారేం? నాతో చెప్పకుండానే!"

సిగ్గుతో తలవంచుకుంది సుశీల, నేల చూపులు చూస్తూ.

"ఆల్ రైట్! ఆలోచిద్దాం. రేపొకసారి నేను పనిచేస్తున్న ఆఫీసుకు రా!" అన్నారాయన.

ఎందుకోసుశీలకు అర్థంకాలేదు. మర్నాడు ఆఫీసుకు వెళ్ళి నిర్ఘాంత పోయింది. సుధాకర్ అక్కడ వున్నాడు, తన నాన్నగారు పని చేస్తున్న ఆఫీసులోనే అతడు గుమాస్తా.

సుధాకర్ తన వంక చూసి, గబగబా సీట్లోంచి లేచి వచ్చి, "ఇదేమిటి! చెప్పాపెట్టకుండా వచ్చేశావు?" అన్నాడు కంగారుగా.

అంతలో సుధాకర్‌కి మానేజింగ్ డైరెక్టర్ గదిలోంచి పిలుపు వచ్చింది. సుధాకర్‌కి గుండె ఆగినంత పనైంది. "ఇప్పుడే వస్తాను" అని, సుశీల సమాధానం కోసం ఎదురు చూడకుండా పరుగెత్తాడు.

సుశీల నవ్వుకుంది.

మానేజింగ్ డైరెక్టర్ గదిలో ఏవో కేకలు వినిపించ సాగాయి. సుధాకర్‌కి ఒడ్డింపులు పడుతున్నాయి. ఆఫీసంతా పిన్‌డ్రాప్ సైలన్స్. డిసిప్లేన్ గురించి మానేజింగ్ డైరెక్టర్ ఉపన్యాసం యిస్తున్నాడు. "ఆమె స్నేహితురాలే కావొచ్చు. నీ కాబోయే భార్యే కావచ్చు ఆఫీసుకి వచ్చి సీట్లో కూర్చున్నాక, తల ఎత్తటం యితర వ్యాపకాల క్రింద లెక్క. ఐ డోంట్ లైకిట్! గెటవుట్ ఫ్రమ్ హియర్"

సుధాకర్‌కి తల తెగినట్లయింది. స్వింగ్ డోర్స్ తెరుచుకుని ఆ గదిలోకి సుశీల రావటం చూశాడతడు. కంగారు పడిపోయి "ఇక్కడికెందుకొచ్చావ్?" అన్న మాటలు పెదాల వరకూ వచ్చాయి. కాని మానేజింగ్ డైరెక్టర్ చెప్పిన డిసిప్లేన్ సంగతి గుర్తుకొచ్చింది. తల వంచుకుని బయటికి వెళ్ళిపోయాడు.

సుశీల మానేజింగ్ డైరెక్టర్ రాజారావ్ వంక చూసింది. తన తండ్రి.

"అమ్మా! సుశీలా! నీవు ప్రేమిస్తున్న సుధాకర్ నాదగ్గరగుమాస్తా. ఏదో నాడు నేనతణ్ణి యీ రకంగా తిట్టవలసి రావచ్చమ్మా!" అని చెబుతున్నట్టనిపించిందామెకు.

సుశీల తండ్రికి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంది. ఆమెలో గంభీరత కన్పిస్తోంది. పేపరు వెయిట్ చేతిలోకి తీసుకుంది. దాని క్రింద ఉన్న కాగితాలన్నీ ఫాన్ గాలిలోకి రెపరెపమంటూ పైకి లేచాయి. తండ్రి చెప్పినదానికి, తనేదో సమాధాన మిస్తున్నట్టున్నాయి సుశీల చూపులు. రాజారావ్‌కి నవ్వు ఆగలేదు. అది గాజు పేపరు వెయిట్ కాదు, తనపేరు వ్రాయబడివున్న రోజ్‌వుడ్ బార్. రాజారావ్ బి. ఎ. అని వుంది దాని మీద. దాన్నే పేపరు వెయిట్‌గా వాడుతూ వుంటాడు తను.

"నాన్నా! ఈ పేపరు వెయిట్ విలువ చాలా చిన్నదే కావచ్చు. దాన్ని తీసి అవతల పారవేస్తే.... పేపరు వెయిట్ తీసి అవతల పారేసి నట్లవ్వదు, తండ్రి పేరు తీసి, దూరంగా విసిరేసి నట్టవుతుంది. సుధాకర్ ఉద్యోగరీత్యా చిన్నవాడు కావచ్చు. కాని నాప్రియుడు. అతడు పేపరు వెయిటంత మనిషే! కాని ఆ పేపరు వెయిట్ మానేజింగ్ డైరెక్టర్ పేరునీ, డిగ్రీనీ, హోదానీ మోస్తోంది. గుమాస్తా చిన్న ఉద్యోగిలా కనిపించవచ్చు. ఆ గుమాస్తా భుజస్కందాలమీదనే ఆఫీసు నడిచేది. నాన్నా! నీ డిగ్రీ బి, ఎ., మరి నేను చదివింది-ఎమ్మెస్సీ. నాకంటే తక్కువ డిగ్రీ అని నిన్ను 'నాన్న' కాదనుకోగలనా! సుధాకర్ గుమాస్తా కావొచ్చు. నామనస్సుని జయించిన ఆరాధ్య దైవం. ఫాన్ చిన్నదే నాన్నా. గదిలో అందరికీగాలిస్తుంది"

ఇవన్నీ సుశీల అన్న మాటలు కాదు. సుశీల చూపులో యిన్ని ధ్వనించాయి.

రాజారావు కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"శెహభాష్ సుశీలా! నేనూ ఒకప్పుడు యిక్కడ గుమాస్తానే! నీ భర్త గుమాస్తా అనే నిస్పృహ నీలో లేదు. అది తెలుసుకునేందుకే నిన్ను ఆఫీసుకు రమ్మంది." అంటూ రాజారావు కుర్చీనించి లేచి వచ్చి, ఆప్యాయంగా కూతురు తల నిమిరాడు.

సుధాకర్ ఎప్పుడు ఫైల్స్ తీసుకుని ఆ గదిలోకి వచ్చాడో తెలియదు. పొడిగా దగ్గాడు. 'ఇది ఆఫీసు. తండ్రీ కూతుళ్ళ ఆప్యాయతలు ఇంటిదగ్గర- డిసిప్లీన్ డిసిప్లినే' అన్నట్టుంది ఆ పొడిదగ్గు. *